పిపీలికం

చీమ – అత్యల్పమైన ప్రాణి. అల్పప్రాణులు ఒంటరిగా ఎందుకూ కొరగానివే. వీమీ చేయజాలనివే. కాని అల్పప్రాణుల సమైక్యశక్తి మాత్రం "పిపీలికాతీతమైన" ఫలితాన్ని సాధించగలదు. చీమ శ్రమజీవికి ప్రతిరూపం. బానిసలు, శ్రమ జీవులు 'తనను తాను' మాత్రమేకాక 'తమను తాను' తెలుసుకుంటే ఫలితం "పిపీలికం" చవుతుంది..

దీని....

మూలకథారచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి

రాచకొండ విశ్వనాథశాస్త్రి గారిని పరిచయం చేయడం సున్నితమైన వ్యవహారమే. ఎందుకంటే ఆయన్నుగురించి తెలియనివాళ్లకు ఏమిచెప్పినా పట్టించుకోక పోవచ్చు. తెలిసినవాళ్లకు ఏమిచెప్పినా కొత్త అనిపించదు. ఆయన పుస్తకాలజాబితా, కథాకథనవైశిష్ట్యం, రచనాప్రతిభ గురించి వివరించడం సాహసంకాగలదు. ఆయనను గురించి స్వభావోక్తులు రాసినా అతిశయోక్తులనిపించే ప్రమాదం ఉంది.

కనుక ఆయన అనితరసాధ్యమైన రచనాశక్తిని గురించి ఏమీమాట్లాడకుండా ఉండడమే 'బుద్ధికిలక్షణం'. ఆయన ఎప్పుడూ ధర్మంవైపునుంటారు. న్యాయంవైపున వకాల్తా తీసుకుంటారు. కర్తవ్యంలో పాలుపంచుకుంటారు.

'పిపీలికం' కథ ఒకమౌలికమైన అన్వేషణతో ప్రారంభమై, ఒకప్రాథమికమైన ఆచరణలో ముగుస్తుంది. ఒక చిన్న చీమకు 'నేనెవరు?' అనే పెద్ద ప్రశ్నతడుతుంది. ఆ ప్రశ్నకు సమాధానంకోసం గురువుల వద్ద విద్యార్జన, జ్ఞానార్జన... కష్టపడి సాధించింది. కాని ప్రశ్న ప్రశ్నలాగే మిగిలింది. అంతపెద్ద ప్రశ్నకూ... చిన్నసమాధానం ఒక దుర్మార్గమైన పాము చెప్పింది. "నీవు చీమవు. నేను పామును. నీవు కష్టించాలి. నేను సుఖపడాలి". ఈ జ్ఞానం చాలు.. చీమ కార్యాచరణకు పూనుగొనడానికి. అదీ కథ మరి దీనిని....

నాటకీకరించినవారు పసుపులేటి పూర్ణచంద్రరావు

పసుపులేటి పూర్ణచంద్రరావుగారి వృత్తి, వ్యాపకం, ప్రవృత్తి... అన్నీ నాటకంతోనే ముడిపడి ఉన్నాయి. గత 8 సంవత్సరాలలో 30 నాటకాలకుపైగా తయారుచేసి ప్రదర్శింపచేసారు. వేదికలూ, తెరలూ, ఆహార్యమూలాంటి హంగులేమీలేకుండా 'వీధి' నాటకాలుమాత్రమే తయారుచేసారు. అందులోనూ తక్షణసమస్యను తీసుకుని ఆ సమస్య చుట్టూ నాటకం అల్లి, నటనలో అనుభవంలేని సామాన్య ప్రజలతో ఆ నాటకాలు ప్రదర్శించారు. 'నటుల్లో' ఎక్కువమందికి అక్షరజ్ఞానం కూడా లేదంటే, పూర్ణచంద్రరావుగారి దృక్పథం అర్థంచేసుకోవచ్చు. ఆపైన అలాంటినటులందరికీ... ఆ తక్షణసమస్యతో గాఢమైన సంబంధం ఉండడమొక్కటే వాళ్లకున్న ప్రధానమైన అర్హత.

సమస్యను వారితోనే చర్చించి, కథన క్రమాన్ని నిర్ణయించుకుని ఎప్పటికప్పుడు రంగవిభజన చేస్తూ, సంభాషణలు అక్కడికక్కడ ఖాయపరుస్తూ ఇంప్రోవైజ్ చేస్తూ – నాటకరచనను పూర్తి చేయడం పూర్ణచంద్రరావు గారి పద్ధతి. రా.వి.శాస్త్రిగారి 'పిపీలికం' కూడా ఆ పద్ధతిలోనే నాటకంగా రూపొందింది.

దీనిని నిర్వహించింది 'శ్రామిక విద్యాపీఠం' రంగారెడ్డి జిల్లా వారు. వీరు సుమారు నూరు మంది బాలకార్మికుల – వ్యవసాయ కార్మికులను – భూస్వామ్య బంధాలనుంచీ విడుదల చేసి, వారికి విద్యావకాశాలు కల్పించారు. వారి వయస్సు 8-11 సంవత్సరాల మధ్య ఉంటుంది. వారికోసం తక్షణ శిక్షణా సౌకర్యాలు కల్పించారు. వారి ప్రతిభను ప్రదర్శించే అవకాశంకూడా ఏర్పరచగలిగితే బాగుంటుందన్న ఊహకు 'పిపీలికం' సరైన ప్రతిరూపం. దీనిలోని చీమల పాత్రలను బాలకార్మికులూ, మిగతా పాత్రలను పెద్దవారూ పోషించారు. సమాజంలో ఏ అవకాశమూలేని బాలకార్మికులు 'పిపీలికం' ప్రదర్శనలో ప్రధాన పాత్రలు నిర్వహించడం ఎంత ధర్మమో, పిపీలికాలన్నీ దుష్టభుజంగాన్ని సంహరించి తమపుట్టను తామే నిలుపుకోవడం అంత కంటే ఎక్కువ న్యాయం. దీనిని

ప్రచురించింది బాలసాహితి

మన పత్రికలలోనూ, సినిమాలలోనూ తరచుగా కనబడే బాలసాహితీ రూపాలు.... కృత్రిమంగా, బాలల మనస్తత్వానికి భిన్నంగా కనబడుతున్నాయి. సహజమైన బాలసాహిత్యాన్ని - బాలలకు అనువైనవీ, బాలలను గురించి తెలిపేవీ - ప్రజలకు అందించాలని చాలాకాలం ఆలోచించి 'బాలసాహితి' సంస్థను ప్రారంభించాం. ఆప్రయత్నంలో ఉండగా 'పిపీలికం' ప్రదర్శనను చూశాం. 'పిపీలికం' నిజంగా బాలసాహిత్యం కాదు. బాలలతో ప్రదర్శించటం వల్ల మేమూహించినదానికంటే ప్రయోజనం ఉందని గుర్తించాం. అందుచేత ఈ పుస్తకాన్ని ముందుగా ప్రచురిస్తున్నాం.

ఆఖరుమాట కట్టుకథలాగా వాస్తవాన్ని చిత్రించడం ప్రజలపట్ల, బాధితులపట్ల ..... నిజంగా ప్రేమున్నవారికే సాధ్యపడుతుంది. ప్రదర్శన విషయంలో కూడా ఆమాటే చెప్పుకోవాలి. కథరాసిన రా.వి.శాస్త్రిగారికీ, నాటకీకరించిన పూర్ణచంద్రరావుగారికీ, ప్రదర్శించిన బాలనటీనటులకు, పెద్దనటీనటులకూ ఒకసారి అభివందనలూ, కృతజ్ఞతలూ తెలుపుతున్నాం. మొత్తం ఈ ప్రదర్శనకు కావలసిన ఏర్పాట్లుచూసిన 'శ్రామిక విద్యాపీఠం - రంగారెడ్డి జిల్లా' వారికీ ముఖ్యంగా శ్రీమతి శాంతాసిన్హాగారికీ కృతజ్ఞతలు చెప్పడం ఒట్టి లాంఛనం మాత్రంకాదు.

మధ్యలో వలయాకారంగా ఒక విశాలమైన రంగం. అదే రంగస్థలం. ప్రేక్షకులు చుట్టూ వలయంగా కూర్చుంటారు. నటీనటులు కూడా ప్రేక్షకుల్లో ముందు వరసలో కూర్చుంటారు. ప్రారంభ శబ్దం కాగానే చీకటిగా నంగేతవు లయకు అనుగుణంగా ఆడుగులు వేస్తూ రంగస్థలంలోకొచ్చి "చెట్ల" అంటుగా వీర్పడతాయి. ఆనందంగా పాట పాడతాయి.

అనగనగా ఎన్నడో
కృతయుగపు సంధిలో
మాందూకుడు ప్రజాపతిగ రాజ్యమేలు రోజుల్లో ।అనగనగా।
శ్యామవనం అనే....చిట్టడవి మధ్యలో (సాకీ మాదిరిగా)
గౌతమి నది ఒడ్డున
చిట్టడవి మధ్యలో....గౌతమి నది ఒడ్డున...

అంటూ చీమలు "నది" లాగా వడుస్తుంటాయి.

చిట్టడవి మధ్యలో....
గౌతమి నది ఒడ్డున.... ।అనగనగా।

అని పాడుతూనే చీమలు "పుట్ట"లాగా ఏర్పడతాయి. తిరిగి పాట అందుకుంటాయి.

చీమలు పెట్టాయ్ పుట్టాకటి
చిట్టి చీమలు పెట్టాయ్ పుట్టాకటి
పెను పర్వత మంటి పుట్టాకటి...



వుట్టలోంచి చీమ రెండు ముసలి చీమలు బైటకొస్తాయి. పాట పాడుతూ ఒకదాని వెనుక ఒకటి ఆహారం కోసం చుట్టూ ఇటూ తిరుగుతూ వెతుకుతుంటాయి.

పాట నెం. 2

చిట్‌చిట్ చిట్‌చిట్ చీమలం
చిట్టి చీమలం
చలి చీమలం ।చిట్ చిట్।
చూడాలన్నా కనపడమూ
చప్పుడు కూడా చేయమూ ।చిట్ చిట్।
చిటుకు చిటుకున పనిచేస్తాము
పరుగు పరుగున పరిగెడతాము
పని పట్టామంటే వదలము మేమూ ।చిట్ చిట్॥
పనిపాట లేనిదె వుండము....
పని పట్టామంటే వదలము మేమూ
పని పాట లేనిదె వుండము...
మేముండము...మేముండము...మేముండము....మేముండము...

రెండు చీమలూ చెరో దిక్కునా వెదుకుతుండగా ....

ముసలి చీమ నెం. 1 :-- ఇక్కడేంటో వుందిరో.....!
ముసలి చీమ నెం. 2 :-- ఏంటిరా?

కనబడ్డ ఆహారాన్ని వానన చూసి, నాకి,

ముసలి చీమ నెం.1 :-- బెల్లంరోయ్ ...!

రెండుచీమలూ ఆనందంతో ఎగురుతాయి.

ముసలి చీమ నెం.2 :-- ఇక మనాళ్లందర్నీ పిలవరా!

ఇద్దరూ కలసి పాట

పాట నెం. 3

రారండోయ్ ! రారండోయ్!
సోదరులారా రారండోయ్
శ్రమ జీవుల్లారా రారండోయ్
చీమ సోదరులారా రారండోయ్
పదపద...పనిపని....పదపద...పనిపని.... (కోరస్)

రారండోయ్! రారండోయ్!

పని దొరికింది రారండోయ్!

పారా పలుగూ తేరండోయ్!

పదపద...పనిపని....పదపద....పనిపని.... (కోరస్)

రారండోయ్! రారండోయ్!

రారండోయ్! అన్న పిలుపు వినగానే "పుట్ట" 'చీమలబడు' గా మారిపోతుంది. చీమలన్నీ పనికోసం, తిండికోసం, "పదపద...పనిపని ... పగపద...పనిపని...." అంటూ పాటని పాడుకుంటూ చేస్తూ పరిగెడుతుంటాయి ఒక చీమ మాత్రం పనిమానేసి చతికిలపడి ఆలోచనలో పడుతుంది.

ఆలోచనల చీమ :-- ఎవర్ని? నేనెవర్ని?

పాట వినపస్తున్నంతసేపూ 'నేనెవర్ని?' అనుకుంటూనే వుంటుంది. చీమల బారు దగ్గరకి

సంకర్లు తిరిగి ఆడుతూ, పాడుతూ నడిచి వెళుతోంటే 'రంగం' మధ్యలో 'ఆలోచనల చీమ' ఒంటరిగా నేలమీద కూర్చునే వుంటుంది. పాట పూర్తవగానే దగ్గర కొచ్చిన చీమంతా

ముసలి చీమ నెం. 1 :-- బెల్లంరా!

బారులోని చీమలన్నీ :-- బెల్లంరోయ్! బెల్లం...!

ఆనందంతో ఎగిరి గంతేస్తాయి

ముసలి నెం.1 :-- ఊ! బెల్లం ముద్దని తవ్వి,
చక చకా మోసుకుపోండి ఊ !

చీమ తర్వాత చీమ బెల్లం పెకిలించి నెత్తిమీద మోసుకొని వెళుతుంటాయి వనిచేయకుండా కూర్చున్న 'ఆలోచనల చీమ'ని ముసలి చీమ చూస్తుంది.

ముసలి చీమ నెం.2 :-- అందరూ కష్టపడుతుంటే ఈడు మొద్దులాగా
ఇలా కూర్చున్నాడేంట్రా!

మరో చీమ :-- నిజమే, ఈడిట్లా కూర్చున్నాడేమిటి?

ఆలోచనల చీమతో

ఇంకో చీమ :-- గాడిదలాగా ఇట్లా కూర్చున్నావేంట్రా ?

ఓ ఆడచీమ :-- ఇలా పనీపాటా లేకుండా కూర్చుంటే ఎలా నాయనా?

ఓ కుర్ర చీమ :-- ఏరా! పనిదొంగా! తెచ్చిపెడితేతిందామనుకున్నావా?

మరో ఆడచీమ :-- జ్వరం గిరం ఏమన్నా వచ్చిందేమో చూడండ్రా

ఆలోచనగా చీమ నుదిటిపై ఓ ఆడచీమ చెయ్యి పెట్టి చూసి

ఓ ఆడచీమ :-- జ్వరమాపాడా! ఏవీలేదు....

ఓ యువక చీమ :-- అయితే వీడు పనిదొంగే. ఏరా మేం తెస్తే తేరగా తిందావనా!

ఓ ఆడచీమ :-- ఛ! అదేం కాదులేరా! రోజూ మనతో పాటే ఒళ్లొంచి పనిచేసేవాడే, ఇవాళే ఇలా చేస్తున్నాడు. అసలేమైందిరా బాబూ!

ముపలి చీమ నెం.1 :-- ఎహే, వీడి సంగతి తర్వాత చూడొచ్చు! ముందు పని కానీయండి.

చీమలన్నీ 'బెల్లం...బెల్లంరా' అనుకుంటూ వరుసెత్తి ఒకదాని తరువాత ఒకటి బెల్లం ముద్దలు తొలచి, వెత్తిమీద మోసుకుపోతుంటాయి. బారులో చీమలన్నీ వెళ్లిపోయి వరుసలో కూర్చున్నాక, రంగంలో రెండు కునలి చీమలు మిగులుతాయి. అవీ బెల్లం మోసుకొని వెళ్ళిపోతూ, మళ్లీ 'నేనెవరు? నేనెవరు?' అని కలవరపడుతున్న ఆలోచనల చీమని చూసి ఆగిపోతాయి.

ముపలి చీమ నెం.1 :-- మరి ఈడ్ని ఏం చేద్దాంరా?

ముపలి చీమ నెం.2 :-- వీడి సంగతి మనకెందుకురా

ముపలి చీమ నెం.1 :-- కాదులేరా, వీడూ మన పిల్లాడే కదా! అసలు ఏమైందో అడుగుదాం.

ఆలోచనల చీమతో

ముపలి చీమ నెం.1 :-- ఏరా! ఏంటి నీ సంగతి?

ఐనా చెప్పకుండా కళ్లు మూసుకునే...

ఆలోచనల చీమ :-- నేనెవరు? నేనెవరు?

ముపలి చీమనెం.2 :-- ఓరి నీ తస్సాదియ్యా, నేనెవరేంట్రా?

మువ్వు చీమవు. మువ్వూ చీమవే, మేమూ చీమలమే. మనందరమూ చీమలమేరా! నేనెవరేమిట్రా వెర్రి వెధవా! అక్కడ బంగారవంటి బెల్లం వుంది. పదరా!

అంటూ ముపలి చీమలు లాగి పోతుంటే ఆలోచనల చీమ మాత్రం అలాగే కూర్చుండి.

ఆలోచనల చీమ :-- నేనెవరు?

ముపలి చీమ నెం.1 :-- లే! లేవరా!

ఆలోచనల చీమ :-- నేనెవరు?

ముసలి చీమ చికాకు పడుతూ.....

ముసలి చీమ నెం.2 :-- లే, లెమ్మంటుంటే!

బలవంతంగా రెక్కపుచ్చుకు లేపుతుంది ముసలి చీమ నెం.2

ఆలోచనల చీమ :-- అసలు నేనెవరు?

నెట్టుకుంటూ ఆలోచనల చీమని బెల్లం దగ్గరకు తీసుకెళ్ళి

ముసలి చీమ నెం. 2 :-- ఎత్తుకోరా!

అయినా ఆలోచనల చీమ చేతులు వేలాడేసుకు విలబడుతుంది.

ఆలోచనల చీమ :-- నేనెవరు?

ఇంకో నెట్టు నెట్టగానే ఆలోచనల చీమ బెల్లం దగ్గర కూలబడుతుంది

ముసలి చీమ నెం. 2 :-- ఏంట్రా మొండికేస్తున్నావ్!

తన్నబోతున్న ముసలి చీమ నెం.2ని ఆపింది ముసలి చీమ నెం.1

ముసలిచీమ నెం.1 :-- ఆగాగు, తొందరొద్దు. చూడబోతే నిజంగానే వీడేదో పెద్ద గొడవలో పడ్డట్టున్నాడు, నెమ్మదిగా అడిగి చూద్దాం.

ఆలోచనలచీమ దగ్గర కూర్చొని సానుభూతిగా

ముసలిచీమ నెం. 1 :-- ఏమిరా అబ్బీ, ఏంటి నీగొడవ? పెద్దవాడ్ని; నీకుతాతలాంటి వాడ్ని; నాకు చెప్పు. మాకు వీలైతే .... తీరుస్తాం కదా!

ఆలోచనల చీమ :-- ఇంతకీ నేనెవర్ని? నేనెందుకు పుట్టాను? ఎందుకు బతుకుతున్నాను? వీటికి నాకు జవాబులు కావాలి. జవాబు దొరక్క సతమతమవుతున్నాను.

అంతలా నుద్విగ్నమైన ఆలోచనలో ఆకాశంకేసి చూస్తూ వుంటుంది ఆలోచనలచీమ.

ముసలి చీమ నెం. 2 :-- అమ్మో చూడ్రో వీడు, ఎంత పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నాడో. వీడడిగే దేమిటో నాకేం తెలీడం లేదు.

ముసలి చీమ నెం.1 :-- అవున్రా ఇట్టాంటి పెద్దపెద్ద సంగతులేవీ మనలాటి వాళ్ళకి తెలీవు. ఇవన్నీ పెద్ద పెద్దోళ్ళు ఆలోచించేవిరా. ఇవన్నీ మనకెందుకురా? మనం చీమలం. ఏదో పనిపాటా చేసుకు బతికేవాళ్ళం....

ఆలోచనల చీమ :-- అవును పనిచేసుకు బతికేవోళ్ళమే కానీ, మరి ఎందుకో నాకు ఇలాంటి ప్రశ్నలే వస్తున్నాయి. ఎంత ఆపుకుందామనుకున్నా ఈ ఆలోచనలు ఆగడంలేదు. మరి ఏం చేయను?

ముసలి చీమ నెం.1:-- నువ్వడిగే వాటికి నేం జవాబు చెప్పలేంరా నాయనా.

ముసలి చీమ నెం. 2 :-- మాకు తెలిస్తే కదా చెప్పటానికి.

ఆలోచనల చీమ :-- మరి నన్నేం చేయమంటారు? ఎంత ఆపుకుందామన్నా నాకీ ఆలోచన్లే తలెత్తుతున్నాయ్? ఏమీ తోచడం లేదు. ఏ పనీ చేయాలనిపించడం లేదు.

వీడ్నేం చేద్దాం అన్నట్టు ముసలి చీమలు రెండూ ఒకదాని ముఖాలు ఒకటి చూసుకున్నాయి. సరిగ్గా ఆ చీమకు వీడో జ్ఞానకం వచ్చి.....

ముసలి చీమ నెం.1:-- ఒరే నాకోటి గుర్తొచ్చింది. మొన్న మన చుట్టాల ఊరెళ్ళినుగా, దార్లో చెట్టుక్రింద బ్రాహ్మడు పిల్లలకి పాఠాలు చెబుతున్నాడు. ఆయనేమన్నా మనవాడి అనుమానాలు తీరుస్తాడేమో! వీడ్ని అక్క డికి పంపిద్దామంటావా?

ముసలి చీమ నెం.2 :-- పంపిద్దాం. పనీపాటా లేకుండా వీడిక్కడ వుండి ఏంలాభం?

ఆలోచనల చీమతో

ముసలి చీమ నెం. 1 :-- ఒరే నాయనా! నీకు మేం జవాబు చెప్పలేం. నువ్విక్కడిలా కూలబడీ లాభంలేదు. ఆ బ్రాహ్మడి దగ్గరకు పంపుతాం పోతావా? ఆయన పిల్లలకు చదువు చెబుతాడు. నీ అనుమానాలు ఆయన

తీరుస్తాడేమా..... చూడుమరి.

ఆలోచనల చీమ :-- పోతాను! ఆయనపేరేమిటి?

ముసలి చీమ నెం. 1 :-- మర్చి పోయారా! ఏదో ఉందీ!

మర్చిపోయిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ.....

ఆ.... ఏదో శరమ

ని....గ.....మ.....శ.....ర్మ.....!

ఆలోచనల చీమ :-- నిగమ శర్మా. నిగమ శర్మ.

ముసలి చీమ నెం. 1 :-- మరి పోతావా?

ఆలోచనల చీమ :-- పోతాను.

ముసలి చీమ నెం. 1 :-- మరి దారి బత్తెం కట్టి తెచ్చుకో పో. బయల్దేరు.

విచారంలో.....

ఆలోచనల చీమ :-- మరి నేనీమధ్య అసలు పని చేయలేదుగా. నా వాటా బత్తెం ఏమీలేదు.

ముసలి చీమ నెం.1 :-- పోనీ నేనిస్తాలే.

కర్రకు గింజలు మూటకట్టి తెస్తూ ఉంటుంది. దూలోగా ...

ముసలి చీమ నెం.2 :-- జాగ్రత్తరా నాయనా. చాలా దూరం పోతున్నావ్.

బాపనాయన దగ్గర బుద్ధిగా వుండి అన్నీ నేర్చుకునిరా!

గిండిలమూలు చేతికిస్తూ

ముసలి చీమ నెం.1 :-- జాగర్తగా వెళ్ళు!

ఆనందంగా వెళ్ళబోతూ.....

ఆలోచనల చీమ :-- అన్నింటికీ జవాబులు తెలుసుకొని వస్తాను. అందర్నీ అడిగినట్టు చెప్పండి.

ఆలోచనల చీమ ఉత్సాహంగా ముందుకు దేరుతుంది. ముసలి చీములు రెండు చేతులు ఊపి వీలుబడతాయి. ప్రేక్షకుల్లో కూర్చుంటాయి. ఆలోచనల చీమ రంగం మధ్యలో కొచ్చి పాట అందుకుంటుంది.

పాట నెం.4

నేనెవరూ? నేనెవరూ....?
నేనెవరూ? నేనెవరూ...?
ఇది చీమకు తగని ప్రశ్నంట.....
మనుషులకే ఇది తెలుసంట.....
ఇది చీమకు తగని ప్రశ్నంట.....
మనుషులకే ఇది తెలుసంట..... ॥ నేనెవరూ ॥
మనుషుల్లోనూ చీములు కాదు
మేథావులకే తెలుసంట
మనుషుల్లోను చీములు కాదు
మేథావులకే తెలుసంట ॥ నేనెవరూ ॥
చీమల్లో మేథావులు ఉండరా?
మరి చీమల్లో మేథావులు ఉండరా?
చీమల్లో మేథావిని అవుతా
చదువు గిదువూ చుట్టేస్తా
వేదం గీదం పట్టేస్తా ॥ నేనెవరూ ॥

పాట ఆపి ఆలోచనల చీమ అన్నిదిక్కులూ చూస్తుంది.

ఆలోచనల చీమ :-- ఊరింకా చాలాదూరం వున్నట్టుందే. ఈ రాత్రికి ఇక్కడే పడుకుంటా.

అలా అనుకుంటూ ఆలోచనల చీమ వెళ్ళి ప్రేక్షకుల్లో కూర్చుంటుంది.

2

నిగమ శర్మ ఇల్లు – ఆరోజు నిగమశర్మ మంచి ఆకలి మీద ఉన్నాడు. ఆలోచనల చీమ ప్లేట్లకుల్లో కూర్చోగానే నిగమ శర్మలేచి 'శూన్యరంగం'లో కొచ్చి ఆకలి బాధ పడుతుంటాడు.

నిగమశర్మ :-- ఎన్ని బాధలైనా భరించవచ్చు కానీ, ఈ క్షుద్బాధ మాత్రం భరించలేమురా భగవంతుడా!

నిగమశర్మ భార్య వచ్చి.....

భార్య :-- ఆకలి.... ఆకలి.... అని ఇప్పుడు బాధపడి ఏంలాభం. ముందే వుండాలి కానీ. మొన్న రైతులొచ్చి వాళ్ళ పిల్లలకు కాస్తంత చదువు చెప్పమంటే మీరేమో చెప్పక పోతిరాయె. పైగా కసిరి తన్ని తగిలేస్తిరి....! నిగమశర్మ :-- తన్ని తగిలెయ్యకపోతే... అడ్డమైన వాడికల్లా చదువు చెప్పడమేనా? చదువుకోవాలంటే అర్హత ఉండాలే. ఆ అర్హత ఉన్నవాడికే విద్య నేర్పాలి.

భార్య :-- అర్హత.... అర్హత... అని జపంచేస్తే ఏంలాభమండీ, అర్హత వున్నవాడెవడూ చదువు చెప్పమని మీ దగ్గరకు రాడాయె. దగ్గరకు వచ్చిన వాళ్లకు మీరు చదువు చెప్పరాయే.... ఇక ఇల్లెలా గడిచేనండీ....?

నిగమశర్మ :-- అన్నిటికీ ఆ భగవంతుడున్నాడు. మనవేమిటీ, నిమిత్త మాత్రులం .....

ఇంతలోనే ఆలోచనల చీమ వస్తుంది – కర్రకు వేలాడే గింజల మూటను భుజాన వేసుకుని

భార్య :-- ఎవరో వచ్చారు చూడండి ....!

నిగమశర్మ .-- ఆ .... ఎవరూ.....?

ఆలోచనల చీమ కర్ర కింగపెట్టి నేలమీదకి వంగి గబగబా పెడుతుంది.

నిగమశర్మ :-- ఆ.... ఎవరూ.... పిపీలకమా? దూరం..... దూరం...

ఆలోచనల చీమ చెవిక్కి అడుగులో అడుగుగా నిలబడుతుంది.

నిగమశర్మ :-- ఏం, ఇలా వచ్చావ్?

లోచనల చీమ :-- నేనెవర్ని అన్న ప్రశ్నలో రేయింబగళ్లు సతమతమవుతున్నా స్వామీ....

నిగమశర్మ :-- ఓహో నేనెవరు అన్న ప్రశ్నతో సతమతమవుతున్నావా? అంటే ఆత్మజ్ఞానం కోసం అన్వేషిస్తున్నా వన్నమాట. ఫరవాలేదే... కానీ ఆప్రశ్నకు జవాబు కాదుకదా, అసలా ప్రశ్నే రాకూడదురా నాయనా నీకు.... నీకా అర్హత లేదు.

భర్త మొండితనం తెలిసిన భార్య కనుక వేరే కల్పించుకుని

భార్య :-- అదే... ఆమాటే అనొద్దంటున్నాను. చదువుకోసం వచ్చిన ప్రతివాడినీ అర్హత అర్హత అని తోలేస్తే ఎలాగండీ! పాపం ఏదో తెలుసుకోవాలని వచ్చినట్టున్నాడు. వాడిక్కావలసింది బోధించండి.

చిరెత్తిపోతూ.....

నిగమశర్మ :-- ఏమి బోధించమంటావే. నా పిండాకూడు. చదువు చెప్పాలంటే బ్రాహ్మ, క్షత్రియ, వైశ్య కులాల వాడు కావాలి. వీడు కనీసం శూద్రుడూ కాదు. పంచముడూ కాదు. ఒట్టి పిపీలకం వెధవ. వాడికి చదువేం చెప్పమంటావే?

ఆమె ఆదేమీ వినకుండా కర్రకున్న గింజల మూటవంక ఆశగా చూస్తుంది.

భార్య :-- ఆమూటలో ఏవిటి నాయనా?

ఆలోచనల చీమ :-- గింజలమ్మా

భార్య :-- ఆ... గింజలా? ఏవి నాయనా....

చీమ గింజలమూట పాదాల దగ్గర భక్తి శ్రద్ధలతో పెట్టగానే గుక్కున తీసుకుని, కడుపుకు హత్తుకుంటూ

భార్య :-- రణగింజలు గురుదక్షిణగా ఇవ్వు నాయనా!

ఆనందంగా భర్తవేపు కొరకొరా చూసి

వాడికేదో చెప్పి పంపండి

అంటూ గబగబా పుట్టలోకి చకచకా వెళ్లిపోతుంది. నిగమశర్మ బిత్తరపోయి భార్య వెళ్ళిన దిక్కే చూస్తూ నెత్తికొట్టుకుంటూ కనురుకుంటాడు.

నిగమశర్మ :-- ఏం చెప్పమంటావే. ఖర్మ. ఖర్మ. ఈ దౌర్భాగ్యపు ముండ నాలుగు రోజులు ఆకలికి తాళలేక ఈ గింజలకు కక్కుర్తిపడింది. ఇప్పుడీ గింజల పాపానికి అడ్డమైన వెధవకల్లా చదువు చెప్పాలి... చీ... చీ... అని

చీమవంక చూస్తూ .....

నిగమశర్మ :-- ఊ. అలా కూర్చో! ఖర్మ, ఏం చేస్తామూ, చదువు చెబుతాను శ్రద్ధగా నేర్చుకో.

మతం పోకుకు కూర్చొని – చేతితో రాస్తున్నట్టుగా ....

నేనెలా అంటే నువ్వలా అను నాయనా ! 'అ'!

ఆలోచనల చీమ :-- అ

నిగమశర్మ :-- ఆ

ఆలోచనల చీమ :-- ఆ

నిగమశర్మ :-- ఇ

ఆలోచనల చీమ :-- ఇ

నిగమశర్మ :-- ఈ ఆలోచనల చీమ :-- ఈ

నిగమశర్మ :-- ఉ ఆలోచనల చీమ :-- ఉ

నిగమశర్మ :-- ఊ ఆలోచనల చీమ :-- ఊ

నిగమశర్మ :-- అం ఆలోచనల చీమ :-- అం

నిగమశర్మ :-- అః ఆలోచనల చీమ :-- అః

సైకి లేస్తూ

నిగమశర్మ :-- ఇంతటితో నీ చదువు పూర్తయింది నాయనా.

ఆలోచనల చీమ :-- ఆ! చదువంతా పూర్తయిందా స్వామీ!

నిగమశర్మ :-- ఆ! అంతే..... నేను నేర్పాల్సిందంతా నేర్పేశాను.

ఆలోచనల చీమ :-- మరి నా ప్రశ్నలు.....?

నిగమశర్మ :-- ఇంకా ఏం ప్రశ్నలురా?

ఆలోచనల చీమ :-- నేనెవరు? నేనెందుకు పుట్టాను? నేనెందుకు బతుకుతున్నాను? ఈ ప్రశ్నలన్నిటికీ జవాబులు కావాలి.

మందహాసం చేసి

నిగమ శర్మ :-- ఇవన్నీ చాలా పెద్ద ప్రశ్నలురా నాయనా. వీటికి సమాధానాలు కావాలంటే వేదంచదువుకోవాలి.

ఆలోచనల చీమ :-- మరి ఆ వేదమే చెప్పండి స్వామీ!

నవ్వి

నిగమశర్మ :-- వేదం అంటే మాటలా?

ఆలోచనల చీమ :-- మీరు చెప్పండి నేను చదువుకుంటాను స్వామి!

చికాకు పడుతూ

నిగమశర్మ :-- నేను చెప్పనూ కూడదు. నువ్వు నేర్వనూ కూడదు. వేదం చదవాలంటే ఎంతో అర్హత కావాలి నాయనా! అసలు ఏ అర్హతా లేనప్పటికీ ఇప్పటికే చాలా నేర్చుకున్నావ్. ఇంతకన్నా పేరాశ కూడదు. వెళ్లు నాయనా.

ఆలోచనల చీమ :-- ఎలా వెళ్లను స్వామీ, నా ప్రశ్నలకు సమాధానం దొరకకుండా!

నిగమశర్మ కోపంగా మాట్లాడుతాడు.

నిగమశర్మ :-- ఏం ప్రశ్నలురా? నీకా యోగ్యత లేదంటుంటే!

ఆలోచనల చీమ ఆలోచనలో పడుతుంది. మార్గం ఏమిటా అని. నిగమశర్మ భార్య

అప్పుడే అక్కడికి వస్తుంది. ఆమెను చూడగానే చీమకు ఏదోగుర్తుకు వచ్చింది.

ఆలోచనల చీమ :-- నన్నీ ప్రశ్నలు వదలడంలేదు స్వామీ! ఎలాగైనా సరే నాకు వేదం చెప్పండి. కావాలంటే మాపుట్టలో వున్న గింజలన్నీ తెచ్చిస్తాను స్వామీ, నాకు మాత్రం వేదం చెప్పండి.

నిగమశర్మ :-- గింజలగురించి కాదురా, వేదం చదువుకునే అర్హత నీకు లేదంటున్నాను కదా!

భార్య :-- అర్హత... అర్హత... అదే మాట అనొద్దంటున్నా - చదువుకోవాలన్న జిజ్ఞాసకన్నా అర్హత ఏమిటండీ, వాడేదో గింజలు తెచ్చిస్తానంటున్నాడు కదా, ఆ గింజలు తీసుకుని ఆవేదం ఏదో చెప్పెయ్యండి. పాపం కుర్రాడు బాధపడుతున్నాడు..... చెప్పండీ..

నుండివెడుతూ

నిగమశర్మ :-- ఏం చెప్పమంటావే నాపిండాకూడు. ఆవేదం అంటూ నాకు తెలిస్తే సోలెడు గింజలకు వేదసారం కాస్తా చెప్పెయ్యక పోదునా? నాకే తెలియదు. ఇంక వాడికేం చెప్పను?

భార్య :-- ఇదంతా నా ఖర్మండీ! నా ఖర్మ!

వినవిసా లోపలికి వెళ్ళిపోతుంది.

నిగమశర్మ :-- నీ ఖర్మకాదే, నా ఖర్మ !

చీమనంక తిరిగి గాంభీర్యంగా

ఇదిగో చూడు నాయనా, ఉన్నమాట చెబుతున్నాను. విను. నేను వేదపండితుడ్ని కాదు. నీకు వేదం చదువుకోవాలన్న కోరికే వుంటే, చతుర్వేది అని ఒక గొప్ప వేద పండితున్నాడు. ఆయన దగ్గరకెళ్లు. ఆయన ప్రసన్నుడై చెబితే నేర్చుకో.

ఆలోచనల చీమ :-- ఆయనెక్కడుంటారు స్వామీ!

నిగమశర్మ :-- ఆ! అలా అడుగు చెబుతా. ఉత్తరాన ఆరుకోసుల దూరంలో శిష్య బృందంతో ఆశ్రమం ఏర్పరచుకొని చతుర్వేదుల వారున్నారు. అక్కడి కెళ్లి నేను పంపించానని చెప్పు. నచ్చితే చెబుతారు.

ఆలోచనల చీమ :-- అలాగే స్వామీ!

పాదాలకు దండం పెడుతుంది చీమ.

నిగమశర్మ :-- ఆయుష్మాన్ భవ! ఇష్టసిద్ధి ప్రాప్తిరస్తు..!

వాడావిడిగా లోపలికి వెళతాడు. ఛిన్నాభిన్నమైన ఆలోచనల చీమ తిరిగి పుంజుకుని

పాట

నేనెవరూ! నే నేనెవరూ!
చదివిందేమో చాలదు అంటా
చదవాల్సిందీ చాలా వుందట.....
ఈప్రశ్నలు నన్ను వదలవు అంటా..... ‖ నేనెవరూ ‖

3

చతుర్వేది ఆశ్రమం. పాట పూర్తయి 'శూన్యరంగం' మధ్యలోకి ఆలోచనల చీమ రాగానే చతుర్వేది గారి శిష్యులు ఇద్దరు హడావిడిగా వస్తారు. శిష్యులకు ఆలోచనల చీమ దండం పెడుతుంది. శిష్యులిద్దరూ ఒక్కసారిగా....

శిష్యులు :-- ఆ ! ఆ! ఎవడ్రా నువ్వు?

ఆలోచనల చీమ :-- నేను నిగమశర్మగారి శిష్యుడ్ని. వేదం చదువుకోవడానికి వచ్చాను.

శిష్యులు :-- ఆ ! నువ్వు వేదం చదువుకుంటావా?

వాళ్లలో వాళ్లే.....

శిష్యులు :-- ముఖం చూడ్రా! వీడు వేదం చదువుకుంటాడట!

శిష్యులు పాట రూపంలో సంగీతానికి దిగి వెళ్ళగొడుతూంటే – ఆలోచనల చీమ భయంగా వెనక్కి అడుగులేస్తూ వుంటుంది.

పాట

శిష్యులు :-- ఓరి పిపీలకాధమా!
ఓరోరి పిపీలకాధమా!
నువ్వు బ్రాహ్మడివా?

ఆలోచనలచీమ :-- కాదు

శిష్యులు :-- క్షాత్రుడివా?

ఆలోచనలచీమ :-- కాదు.

శిష్యులు :-- బ్రాహ్మడు కావు..... క్షాత్రుడు కావు
బ్రహ్మజ్ఞానం నీకెందుకురా? । బ్రాహ్మడుకావు ।
పోనీ వైశ్యుడివా?

ఆలోచనలచీమ :-- కాదు

శిష్యులు :-- కనీసం శూద్రుడివా?

ఆలోచనలచీమ :-- కాదు....

శిష్యులు :-- వైశ్యుడు కావు.... శూద్రుడు కావు.....
వేదం గీదం నీకెందుకురా? । వైశ్యుడు ।
పోనీ నువ్వు మాలవా?

ఆలోచనలచీమ :-- కాదు.

శిష్యులు :-- మాదిగవా?

ఆలోచనలచీమ :-- కాదు

శిష్యులు :-- మాలవుకాదు..... మాదిగ కావు
మనిషివి కూడా కానేకావు
కంటికి కూడా కనపడనట్టి
చెవులకి కూడా వినపడనట్టి
పురుగుజాతికి చెందిన ఒఠ్ఠి
పురుగుజాతికి చెందిన ఒఠ్ఠి
పిపీల కాధమా ఫో!
ఫో! ఫో!
పో వేర పామ్మికన్
పో పోవేర పామ్మికన్....

ఈచాడావిడి విని చతుర్వేది గారు వస్తారు. గాంభీర్యంగా.

చతుర్వేది :-- ఏవిటిరా గోల?

ఇద్దరూ ఒక్కసారిగా

శిష్యులు :-- వీడు.... ఈ చీమ వెధవ... వేదం చదువుతాట్ట! తన్ని గెంటేస్తున్నావండీ!

ఆలోచనల చీమ చతుర్వేదికి పాదాభివందనం చేస్తుంది.

చతుర్వేది :-- ఊ! ఊ! ఏవిటి నాయనా?

ఆలోచనల చీమ :-- నేను నిగమశర్మగారి శిష్యుడనండీ, మీరు దయతలిస్తే వేదం చదువుకుంటాను.

చతుర్వేది :-- ఊ! ఊ! కోరిక మంచిదే! కానీ, అందుకు అర్హత వుండాలిగా నాయనా!

ఆలోచనల చీమ :-- నాకు చదువొచ్చునండీ!

చతుర్వేది :-- చదువొకటి సరిపోదు. వేరే అర్హతలుండాలి. అవి నీకు లేవు. చదివిందాంతో తృప్తిపడు నాయనా!

ఆలోచనల చీమ :-- నా చదువుతో నాకు తృప్తి కలగలేదండీ! ఇంతవరకూ చదివిన చదువు నా ప్రశ్నలకు జవాబివ్వలేదు. మరి నా ప్రశ్నలేమో నన్నొదలకుండా వున్నాయి.

చతుర్వేది విడ్డూర పడతాడు

చతుర్వేది :-- పిపీలకానికి నీకేం ప్రశ్నలురా? హాయిగాపోయి పనిచేసుకోక!

ఆలోచనల చీమ :-- ఈ ప్రశ్నలు నన్ను ఏపనీ చేయనీకుండా పట్టి పీడిస్తున్నాయండీ!

చతుర్వేది :-- పనిచేసేవాడు పని మానేయడం కన్నా ప్రమాదం మరోటి లేదు. ఆ ప్రశ్నలేవిటో త్వరగా చెప్పు నాయనా. సమాధానం చెప్పేసి పంపిస్తాను. పోయి పని చేసుకుందువుగాని...

ఆలోచనల చీమ :-- ఈప్రశ్నలు నన్ను చాలా బాధపెడుతున్నా యండీ! అసలు నేనెవర్ని? నేనెందుకు పుట్టాను? ఎందుకు బతుకుతున్నాను. ఈప్రశ్నలన్నింటికీ సమాధానాలు నాకు కావాలి.

చతుర్వేది అబ్బురపడతాడు. కొద్దిగా భయపడతాడు కూడా.

చతుర్వేది :-- అంటే... వేదసారం అడుగుతున్నావన్నమాట!

శిష్యులు :-- వేదంలేదు గీదంలేదు..... పో..... పో.....

చతుర్వేది :-- ఆగండాగండిరా! వీడు సామాన్యుడులా లేడు.

ఆలోచనల చీమ :-- కొండంత ఆశతో కోసుల దూరం నడచి మీదగ్గరకొచ్చాను. దయతలచి నాకు వేదం చెప్పండి స్వామీ.

అల్పుడి కోర్కెకు చతుర్వేది నవ్వి అలాంటి వేదం ఎంత అసాధ్యమో కూడా ముద్దుగా నూగలించి చెప్పాలనుకుంటాడు.

చతుర్వేది :-- నిన్ను మించిన కోరికైతే కోరావు గానీ, నీకు వేదం చదువుకునే అర్హత లేదు నాయనా!

ఆలోచనలచీమ :-- ఏరకంగానైనా నాకు వేదం చదువుకునే అర్హత రావాలంటే ఏం చేయాలి స్వామీ!

చతుర్వేది చిక్కున పడతాడు.

చతుర్వేది :-- జన్మతః నీకయితే అర్హత లేదు కానీ నిన్ను ద్విజుడ్ని చేస్తే ఏమో!

ఆలోచనల చీమ :-- ద్విజుడ్ని చేయడం అంటే ఏమిటి స్వామీ?

చతుర్వేది :-- అంటే నీకు మరోజన్మ ప్రసాదించడం అన్నమాట.

ఆలోచనల చీమ :-- అలాచేసి నాకు వేదం చెప్పండి స్వామీ.

చతుర్వేది :-- ఆహా ద్విజుడ్ని చేయడం అంటే మాటలా! నిన్ను హిరణ్య గర్భుడ్ని చేస్తేగానీ సాధ్యంకాదు.

ఆలోచనల చీమ :-- హిరణ్యగర్భుడ్ని చేయటం అంటే ఏమిటి స్వామీ?

చతుర్వేది :-- అదంతా చాలా పెద్ద తతంగంలేరా. నీకు చెప్పినా అర్థం కాదు. దానికంతటికీ బోలెడంత హిరణ్యం కావాలి.

ఆలోచనల చీమ :-- హిరణ్యం అంటే ఏమిటి స్వామీ!

చతుర్వేది :-- హిరణ్యం అంటే ఒంగారం. తేగలవా?

ఆలోచనలచీమ:-- బంగారమా? బంగారంతో మాకేంపనండీ? మాపుట్టలో బంగారం ఉండదు స్వామీ! ఉత్త గింజలే వుంటాయి. కావాలంటే మీకు ఎన్ని గింజలైనా తెచ్చిస్తాను. ఆ వేగమేదో చెప్పండి స్వామీ!

చతుర్వేది :-- గింజలకి వేదం ఎవిటిరా అల్పుడా! నిన్ను హిరణ్యగర్భుడ్ని చేయాలంటే నువ్వు పట్టేంత కుండ బంగారంతో చెయ్యాలి. అంత బంగారం తెచ్చుకుంటే నిన్ను ద్విజుడ్ని చేస్తాను. అయినా బంగారం తెచ్చుకున్న ప్రతి వెధవనీ నేను ద్విజుడ్ని చేయను. నువ్వు చూడబోతే శ్రద్ధవున్న విద్యార్థిలా కనబడుతున్నావని పూనుకుంటున్నాను. ఇక మరి నీ ఇష్టం.

ఇది గొప్ప అదృష్టమే అని అర్థమవుతున్నా బంగారం ఎక్కడ్నించి తేవాలా బాబూ అని ఆలోచనలో పడిపోతుంది ఆలోచనల చీమ.

చతుర్వేది :-- మరి బంగారం తేగలవా!

ఆలోచనల చీమ :-- ఆ! తప్పుతుందా! ఎలాగోలా తెస్తాను స్వామీ!

పాదాభివందనం చేస్తుంది.

చతుర్వేది :-- దీర్ఘాయుష్మాన్ భవ!

ఆలోచనల చీమ బైలుదేరుతుంది. చతుర్వేది, శిష్యులూ కూడా లోపలికి వెళ్ళిపోతారు. రంగంలో ఆలోచనల చీమ ఒక్కటే వుంటుంది. అది గొప్ప ఆలోచనలో పడిపోతుంది. తనలో తాను.....

ఆలోచనల చీమ :-- బంగారం ఎలా వస్తుందబ్బా? డబ్బు పెట్టి కొనుక్కుంటే వస్తుంది అని అంటారు. మరి డబ్బెలా వస్తుందో? పనిచేస్తే వస్తుందని అంటారు... మేమెప్పుడు పనిచేసి గింజలు సంపాదిస్తామే కానీ, డబ్బులు సంపాదించమే..... అంటే పనిచేసి గింజలు సంపాదించి, తర్వాత గింజలకు బదులు డబ్బులు తీసుకోవాలన్నమాట..... ఆతర్వాత డబ్బులతో బంగారం కొనుక్కోవాలన్నమాట. అమ్మో! చాలా తతంగం వుందే! అయితే అయింది, ఎంత కాలమన్నా కానీ బంగారం సంపాదించాలి. ద్విజుడ్ని కావాలి. వేదం చదవాలి. నేనెవర్రో తెలుసుకోవాలి. అంతే!

తిరుగులేని నిర్ణయంతో ఆలోచనల చీమ బైలుదేరుతుంది. మైమ్‌లో నెత్తిన బరువు మోసుకుంటూ భారంగా నడుస్తూ రంగం మధ్యలోకి తెచ్చి వదేస్తూ వుంటుంది. మళ్లీ మళ్లీ అదే చేస్తూండగా కోరస్‌లో పాట. స్టేక్షకుల్లో నుంచి వరునలో కూర్చున్న చీమలన్నీ హావభావాలు చేస్తూ పాడుతుంటాయి.

పాట నెం. 7

రెక్కలు ముక్కలు చేసుకు చీమ

తీసుకు వచ్చే బంగారం....

రేణువు రేణువు బంగారం

రేణువు రేణువు బంగారం...

మూడు నాలుగుసార్లు బంగారం మోసుకొచ్చి రంగం మధ్యలో వదేయగానే, చతుర్వేది శిష్యులతో నవోవస్తాడు. బంగారం రాశి చూసి తృప్తిగా తలూపుతాడు. ఆలోచనల చీమ చెమట తుడుచుకొని చతుర్వేదికి పాదాభివందనం చేస్తుంది. హిరణ్య గర్భుడ్ని చేసే తంతు మైమ్‌లో ప్రారంభమవుతుంది. అవుతూనే పాట మహాద్భుతమైన ట్యూన్లో వెక్కిరింతగా సాగుతుంది. స్టేక్షకుల్లో నుంచి వరునలో కూర్చొని పాడుతున్న మిగతా చీమలు చతుర్వేదిని వెక్కిరిస్తూ హావభావాలు కూడాచేస్తాయి.

బంగారంతో జన్మలు మార్చే బ్రాహ్మడికోసం బంగారం....

రేణువు రేణువు బంగారం

రేణువు రేణువు బంగారం....

చీమని కూడా ద్విజుడ్ని చేసే బ్రాహ్మడికోసం బంగారం

రేణువు రేణువు బంగారం

రేణువు రేణువు బంగారం

నేపథ్యంలో పాట వింగావూర్వకంగా సాగుతుండగా చతుర్వేది హోమంచేసి మంత్రాలు చదువుతూ, ఆలోచనల చీమని బంగారపు కుండలో కూర్చోబెట్టి పైకి తీస్తాడు. తరువాత ఖాళీ బంగారపు కుండని శిష్యులకిచ్చి లోపలికి పంపుతాడు. ఆ తర్వాత యజ్ఞోపవీతుడ్ని చేస్తాడు చీమని. ఈ కర్మకాండ, పాట పూర్తవగానే ఆలోచనల చీమ చతుర్వేదికి పాదాభివందనం చేస్తుంది.

చతుర్వేది :-- ఆయుష్మాన్‌భవ! ఇప్పుడు నువ్వు ద్విజుడవు. వేదం చదువుకునే అర్హత సంపాదించావు.

ఆలోచనల చీమ :-- ధన్యుడ్ని స్వామీ!

చతుర్వేది :-- ఇలా కూర్చో నాయనా ! ఇప్పుడు నీకు వేదం చెబుతాను.

చతుర్వేదికి ఎదురుగా ఆలోచనల చీమ కూర్చుంటుంది.

చతుర్వేది :-- ఓం....!

ఆలోచనల చీమ :-- ఓం .....!

చతుర్వేది :-- సోహం ....!

ఆలోచనల చీమ :-- సోహం....!

పైకి లేచి

చతుర్వేది :-- లే నాయనా! ఇంతటితో నీ చతుర్వేదాలూ పూర్తయ్యాయి.

ఆలోచనలచీమ :-- ధన్యుడ్ని స్వామీ! మరి నా ప్రశ్నలకు జవాబులో?

చతుర్వేది :-- ఇంకేం ప్రశ్నలురా నాయనా?

ఆలోచనల చీమ :-- నన్ను మొదట్నుంచీ బాధపెడుతున్న ప్రశ్నలే స్వామీ! నేనెవర్ని? నేనెందుకు పుట్టాను? నేనెందుకు బంధుకుతున్నాను? వీటి తత్వం ఏమిటో చెప్పండి స్వామీ?

చతుర్వేది :-- ఇంకా అర్థం కాలేదా నాయనా?

ఆలోచనల చీమ :-- కాలేదు స్వామీ!

చతుర్వేది :-- సర్వ వేదాలూ చదువుకున్నా అర్థం కాలేదంటే నేనేం చేయనురా నాయనా!

ఆలోచనల చీమ :-- నాకర్థం అయ్యేలా చెప్పండి స్వామీ !

చతుర్వేది :-- చతుర్వేద పారంగతుడివి, నీకు చెప్పడం ఏవిటి నాయనా? నీకు నువ్వే తెలుసుకోవాలి.

ఆలోచనల చీమ :-- నాకు సాధ్యం కాకనేకదా స్వామీ గురుముఖతః తెలుసు కోవాలని తాపత్రయపడేది.

చతుర్వేది :-- గొప్ప రహస్యం చెబుతున్నాను విను. ఇలాంటి ఆత్మగతమైన తాత్విక ప్రశ్నలకి ఎవర్ని అడిగినా లాభం లేదు. నీకు నువ్వే అంతర్ముఖుడవై తెలుసుకోవాలి.

ఇంకేమనాలో తోచక ఆలోచనల చీమ చూస్తూ నిలబడి పోతుంది.

చతుర్వేది :-- ఇక సత్యాన్వేషణ స్వయంగా ప్రారంభించు. వెళ్ళు నాయనా వెళ్లు.

ఆలోచనల చీమ చాలా నీరుగారిపోతుంది. నిస్సహాయంగా చతుర్వేది వంక చూస్తుంది.

ఆలోచనల చీమ :-- ఇంత చదువూ చదివి నా ప్రశ్నలు నాకే మిగిలి పోయాయి. ఇప్పుడు నాకేదారి స్వామీ !

చతుర్వేది :-- తపస్సు చేసుకో నాయనా!

ఆలోచనల చీమ :-- ఆ! తపస్సా!

చతుర్వేది :-- ఆ.... తపస్సే. అదొక్కటేమార్గం.

మరీ అయోమయంలో పడుతుంది ఆలోచనల చీమ. ఇకఆక్కడవుండీ లాభంలేదని చతుర్వేది కాళ్ళకు దండంపెట్టి బయలుదేరుతుంది.

చతుర్వేది :-- ఆయుష్మాన్‌భవ!

చతుర్వేది లోపికి వెళ్ళగానే రంగంలో ఆలోచనల చీమ ఒంటరిగా మిగిలిపోతుంది. తనలో తాను .....

ఆలోచనల చీమ :-- ఆ...! నాప్రశ్నలకు జవాబిచ్చేది తపస్సా! తపస్సు జవాబెలా ఇస్తుంది... తపస్సంటే ఆలోచనల్ని బంధించాలి. అలా బంధిస్తే నాప్రశ్నలకు జవాబెలా లభిస్తుంది? లాభంలేదు. తపస్సు లాభం లేదు.

ఆవేదనతో పాట.....

పాట నెం. 8

నేనెవరూ? నే నేనెవరూ?
చతుర్వేదాలు చదివినగానీ
కథ మొదటికి మళ్ళీ వచ్చింది.....
నా ప్రశ్నే నాకు మిగిలింది..... । నేనెవరూ ।

ఆలోచనల చీమ :-- చీ.....చీ.... ఇంత చదువూ చదివి, ఇన్ని దేశాలూ తిరిగి ఏంలాభం. నా ప్రశ్నలకు జవాబు దొరక్కపోగా, పనిపాటలక్కూడా దూరమయ్యాను. ఇప్పుడు పుట్టకన్నా తిరిగి వెళితే..... ఇన్నాళ్ళు పనెగ్గొట్టి తిరిగానని మావాళ్ళందరూ నన్ను రానిస్తారో లేదో..... ఏది ఏమైనా సరే ఇంటికి వెళతాను.

ఇల్లు చేరుతుండగా ఉన్నట్టుండి అరుపులు, కేకలు. చీమలన్నీ భయంగా చెల్లాచెదురుగా పారిపోతున్నాయి. వీనిలాగి అని ఒకటి రెండు తెలిసిన మాటల్ని అనబోయినా ఆగకుండా 'పారిపో! ప్రాణాలు దక్కించుకో!' అని నోట్లోనుకుని పరుగెడుతూనే ఉంటాయి. ఈ ఉరుకులు పరుగుల్లో తనను తగులుకొమ్మని వచ్చిన ముసలి చీమ కనిపిస్తే గట్టిగా చెయ్యి పట్టుకుని ఆలోచనల చీమ ఆపుతుంది.

ఆలోచనల చీమ :-- ఏమైంది తాతా? ఏమైంది? మనవాళ్ళందరూ పుట్ట వదిలి ఎందుకు పరుగెడుతున్నారు?

వెళ్ళిపోవు తేరపార చూసి.....

ముసలి చీమ 1 :-- ఓ నువ్వంట్రా! ఒరేయ్! పదేళ్ళ కిందట చదువుకోను దేశాలు పట్టుకుపోయాడే, వాడేరా వీడు!

ముసలి చీమ నెం.2 :-- ఓరి! నువ్వా అందరికీ కాలం మూడినప్పుడే తిరిగొచ్చావుగానీ, మళ్లీ ఎక్కడికన్నా పారిపో.

అలా చెప్పి పారిపోతుంటే ఆలోచనల చీమ మళ్లీ గబగబా ముసలి చీమలిద్దర్నీ ఆపుతుంది.

ఆలోచనల చీమ :-- ఏమైంది? మనం పుట్టొదిలి ఎందుకు పారిపోవాలి?

ముసలి చీమ నెం.1 :-- ఎక్కడినుంచోగానీ, ఓ పెద్దపాము వచ్చి మన పుట్టలో చేరింది. ప్రాణాలు గుప్పెట్లో పట్టుకుని చెల్లాచెదురుగా పారిపోతున్నాం. నువ్వూ పో...

ఆలోచనల చీమ :-- ఆ.... పామొచ్చి పడిందా? పారిపోవాలా? మనింట్లో ఎవరన్నా వచ్చిపడితే వాడ్ని వెళ్లగొట్టాలేగానీ, మనవే ఎక్కడన్నా పారిపోతామా?

ముసలి చీమ నెం.2 :-- నాలుగు ముక్కలు నేర్చుకుని పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నాడీడు చూడరా..

ఆలోచనల చీమ :-- మరి మనిల్లు పాముకే వదిలిపెట్టి పోవాలా?

ముసలి చీమ నెం. 1 :-- ఒరే, నువ్వు నిజంగానే చదువుకున్న వాడిలాగే మాట్లాడుతున్నావు కానీ ఇది మొదట్నుంచి వున్నదేరా! మనమేమో

చీమలం. కష్టపడి పుట్టలు కడతాం. ఆపాములేమో వచ్చి చల్లగా చేరతాయి. ఇది పాతకథేరా బాబు!

ఆలోచనల చీమ :-- ఏది ఏమైనా సరే మనిల్లు పాముకు వదిలిపెట్టేది లేదు.

ముసలి చీమ నెం.2 :-- వదలకపోతే, మనం పామునేమన్నా తన్నెళ్ళ గొడతామా?

ఆలోచనల చీమ :-- తన్నెళ్లగొట్టకపోయినా, కనీసం పోయి అడుగుదాం. నువ్వు మాయింట్లోచేరితే మాగతేంకాను అందాం.

ముసలి చీమ నెం.1 :-- ఆమాట పామునెవడడుగుతాడ్రా? నువ్వడుగుతావా?

ఆలోచనల చీమ :-- ఆ! అడిగి తీరుతాను. మీరందరూ నావెనుకరండి.. నేను పామునడక్కపోతే చూడు.

చీమలన్నీ ఆశ్చర్యంగా నోళ్ళు చూసుకుంటాయి. మొదటివాడు ఇంత గొప్పకుశాలి అయ్యాడా అని. వాళ్ల లొంగుబాటు చూసి ఆలోచనల చీమకు మరింత ఉత్సాహం వచ్చింది.

ఆలోచనల చీమ :-- పారిపోతున్న మనవాళ్లందర్నీ వెనక్కి పిలవండి. నేను మాట్లాడతాను.

ముసలిచీమ నెం. 1 :-- రండిరా! రండి! పారిపోకండి. అందరం మాట్లాడుకుందాం రండి.

అన్ని చీమలూ వస్తాయి.

ముసలి చీమ నెం. 2 :-- ఒరే, పదేళ్ల కిందట పరదేశాల్లో చదువుకోడానికి వెళ్లాడే, వాడు తిరిగొచ్చాడా!

ఓ చీమ :-- ఓరి నువ్వా? ఎప్పుడొచ్చావ్?

ఆలోచనల చీమ :-- ఇప్పుడే.

మరో చీమ :-- పరదేశాల్లో ఏంచేశావు ఇన్నాళ్లూ?

ఆలోచనల చీమ :-- చదువుకున్నాను.

ఇంకో చీమ :-- ఏం చదివావురా?

ఆలోచనల చీమ :-- ఓ చాలా చదివాను గానీ, ఏంలాభంలేదు. అదంతా ఇప్పుడొద్దు, ముందు మీరందరూ ఎందుకు పారిపోతున్నారో చెప్పండి!

ఓ చీమ :-- ఓ. నీకు తెలీదురా? మన పుట్టలో పెద్ద పామొచ్చి పడింది.

ఆలోచనల చీమ :-- పామొచ్చి పడితే, ఆపామునే వెళ్లగొట్టాలిగానీ, మనవే పారిపోతామా?

వేరే చీమలు :-- ఓరి! వీడికెంత ధైర్యం! పాము వెళ్లగొడతాడంట, మొనగాడు!

ముసలి చీమ నెం. 2 :-- వీడు బాగా చదువుకుని చాలా తెలివి మీరాడురా! పాముతో మాట్లాడి వెళ్లగొడతానంటుంటేను నేను మిమ్మల్నందర్నీ వెనక్కి పిలిచాను.

ఓ చీమ :-- ఏంరా, పాముతో నిజంగా మాట్లాడతావా?

ఆలోచనల చీమ :-- ఓ మాట్లాడతాను. మీరంతా నావెనుక నిలబడండి, చాలు.

కొన్ని చీమలు :-- అమ్మో, మేం రాంబాబు! ఆ పాడు పాము దగ్గరకి.

కొన్ని పిరికి చీమలు వెనక్కి తిరిగి వెళ్లిపోతుంటాయి.

ముసలి చీమ నెం. 1 :-- అరే వెళ్ళకండి నిలబడండి మనకేం భయం లేదు. మనం మనవాడి వెనకే వెళ్లి దూరంగా నిలబడదాం. ఆ మాట్లాడేదేదో వాడొక్కడే మాట్లాడుతాడు. మనకేం భయంలేదు.

చీమలు :-- అలా దూరంగా నిలబడటానికి అయితే వస్తాం.

ఆలోచనల చీమ :-- సరే పదండి.

ఆలోచనల చీమ అడుగులో అడుగు వేస్తూ గుంపు నడుస్తోంటే, మిగతా చీమలు స్వీ భంగా భయంగా విళ్ళబ్దంగా వెనుక నడుస్తున్నాయి. వలయాకారంగా వడిచి రంగం

మధ్యలో కొచ్చాక నిశ్శబ్దంగా ఉండమని సైగ చేస్తూనే ఎడమచేత్తో చిన్న లోగొంతుతో.....

ఆలోచనలు చీమ :-- నెమ్మదిగా వెనక్కెళ్లి కొంచెం దూరంగా కూర్చోండి. నేను పుట్టలోకి వెళ్లి పాము ఏంచేస్తోందో చూసి వస్తాను.

చీమలు నెమ్మదిగా వెనక్కి అడుగులేసి స్నేహితుల్లో కూర్చుండిపోతాయి. ఆలోగానూ చీమకూడా మరికొంచెం ముందుకెళ్లి స్నేహితుల్లో కూర్చుంటుంది.

4

పాము రంగంలో ప్రవేశించి వివరంలేని కారణం చెప్పుకుంటూ లంగరు వేసుకుంటూ. తర్వాత ఎలుకల్ని వేటాడి తింటుంది. పీకల్దాకా ఎలుకల్ని తిన్నాక బ్రేవ్‌మని తేన్పు భూమ్యాకాశంతో నేలమీద నెమ్మదిగా ఒరుగుతుంది. కళ్ళు మూతలు పడుతుంటాయి. నేలమీద పడి నెమ్మదిగా దొర్లుతుంటుంది. క్రమంగా సురకపెట్టి నిద్ర పోతుంది. ఆలోచనగా చీమ నెంబు మిగతా చీమలు నెమ్మదిగా భయం భయంగా

అడుగులో అడుగువేస్తూ వస్తాయి. పాము చుట్టూ దూరందూరంగా ఓ అర్ధ వలయం నడిచాక – ఆలోచనల చీమ మిగతా చీమల్ని కొంత వెనక్కి నడిపించి తనూ ఒంటరిగా పాముకి దగ్గరగా ఒకటి రెండు అడుగులు ముందుకు వేస్తుంది. నిద్రపోతున్న పామును లేపటానికి నన్నగా దగ్గుతుంది. ఆలికిడికి పాము కొంచెంగా కదలి, కళ్లు తెరవడానికి ప్రయత్నం చేస్తుంది. ఆలోచనల చీమ మళ్ళీ దగ్గుతుంది. పాము ఉలిక్కిపడి కొంచెంగా తలెత్తి చూస్తుంది. కోపంగా .....

పాము:– ఎవడ్రావాడు, బంగారం లాంటి నిద్ర పాడు చేసిందీ...ఆ...!

ఆలోచనల చీమ భయపడి వెనక్కి తగ్గినా, నిలదొక్కుకొని లొంగిపోతూ

ఆలోచనల చీమ :– ఎవరయ్యా నువ్వు? మా ఇంట్లోకొచ్చి హాయిగా పడుకున్నావ్?

పాము కళ్లు పూర్తిగా విప్పి చూశాడు. నిద్రపోతున్న తనను లేపింది చాలక, తనని ప్రశ్నలడుగుతోంది ఓ అల్పజీవి చీమ అని తెలుసుకొని ఆశ్చర్యపోతుంది. చీమ మళ్ళీ అడుగుతుంది.

ఆలోచనల చీమ :– మాఇంట్లోకొచ్చి మమ్మల్నే వెళ్లగొట్టి, హాయిగా నిద్ర పోతున్నావే! ఎవరు నువ్వు?

అమ ... పాముకి కోపం జుమ్మనుకుంటూ వచ్చినా ఎదురుగా నిలబడ్డని – ధైర్యంగా నిలబడ్డా, ఉత్త చీమలకు భయపడి తమ్ము తానే కాంతించ కోమకుంది. నెమ్మదిగా ఒళ్ళు కదిపి మోతాదుగా కొంచెంగా కోపం చీమతో ఎగతాళిగా

పాము :-- ఆ .... నన్నే ఎవరని అడుగుతున్నావే? కనపడ్డంలేదా? నేను సుఖభోగిని. అంటే సుఖంగా తిని పడుకునే వాడినన్నమాట. సుఖంగా తినడం, సుఖంగా పడుకోవడం మా జన్మహక్కు. అర్థం అయిందా ఇంకేవన్నా కావాలా?

వెటకారంగా నవ్వి నెమ్మదిగా నిద్రలోకి జారుకుంటుంది. దూరంగావున్న చీమలు ఆలోచనల చీమతో నెమ్మదిగా గునగునగా!

చీమలు :-- అడుగుతానన్నావుగా! అడుగు.....!

అలికిడికి పాము 'ఆయ్'అంటూ కళ్లు తెరచి చీమని చూస్తుంది.

పాము :-- ఇంకా ఇక్కడే వున్నావా? ఆ.....!

పాము గద్దింపుకు చీమలన్నీ దద్దరిల్లి అవతలకి పారిపోతాయి. ఆలోచనల చీమకూడా భయంతో రెండడుగులు వెనక్కి వేసినా, నిలదొక్కుకుని భయంగభయంగానే మాట్లాడబోతుంది.

ఆలోచనల చీమ :-- నువ్వు మాఇంట్లోకొచ్చి....

పాము :-- ఆయ్! ఎంత ధైర్యంరా నీకు? మళ్లీ నన్ను ప్రశ్నిస్తున్నావా? నేనెవరైందీ చెప్పినా నీకింకా బుర్రకెక్కినట్టులేదు. నీముఖం చూస్తుంటే నువ్వెవరయిందీ నీకు తెలిసినట్టులేదు. అదికూడా నేనే చెప్పాలా?

వెటకారంగా నవ్వి పాము మళ్లీ పడుకుంటుంది.

నేనెవరూ? పాట చరణాలు నేపథ్యంలో నన్నగా వినబడతాయి, ఆలోచనల చీమకు తన అనలు ప్రశ్న జ్ఞానకం చేస్తూ..... దాంతో ఆలోచనల చీమ తనలో తాను అనుకుంటుంది.

ఆలోచనల చీమ :-- ఆ.....! వీడు నేనెవరో చెబుతానంటున్నాడే! నేనెవరు? అన్న ప్రశ్న కోసమే కదా నేనిన్నాళ్ళూ ఇన్ని ఊళ్లు తిరిగింది; ఇంత చదువూ చదివింది. అయినా సమాధానం దొరక్క కొట్టుకుంటున్నాను. వీడికి జవాబు తెలుసా? చెబుతానంటున్నాడే. చూడబోతే వీడు నా శత్రువాయే! వీడినుంచీ నాకు జ్ఞాన బోధా..... సరే, కానీ !

తిరిగి పామువి లేపేందుకు నవ్వుగా దగ్గరకెళ్తుంది.

ఆలోచనల చీమ :-- నేనెవరో చెబుతానంటున్నావ్. నేనెవరో నీకు తెలుసా? నేనెవర్నీ? నేనెందుకు పుట్టాను? నేనెందుకు బతుకుతున్నాను? వీటికి జవాబు నీకు తెలుసా?

పాము గుండగు ఆశ్చర్యంగా చూసి తర్వాత విరగబడి నవ్వుతుంది.

పాము :-- నువ్వందర్లాంటిచీమ వెధవలా లేవే? జ్ఞాన మార్గం కోసం యమ బాధపడి పోతున్నట్టున్నావే? నువ్వెవరో చెప్పాలా? అయితే విను.

లేచి ఒళ్లు విరుచుకుంటుంది.

ముందు నేనెవర్నో తెలిసింది కదా! మళ్లీ చెబుతా విను! నేను సుఖభోగిని. ఇక నువ్వెవరివంటే – నువ్వు శ్రమజీవివి. శ్రమపడి పనిచేయడానికి దేవుడు నిన్ను పుట్టించాడు. నువ్వూ, మీ చీమలూ కలిసి కష్టపడి పనిచేసి గింజలు పోగుచేయండి. పుట్టలుకట్టి అందులో నిలవచేయండి. మేమొచ్చి అందులోపడుకుంటాం.గింజల్ని తింటానికొచ్చిన ఎలుకల్ని తింటుంటాం. తెలిసిందా?

నవ్వుతూ....

ఇవాల్టికి ఈ జ్ఞానబోధ చాలు పో! నాకు నిదరొస్తుంది. పడుకోవాలి.

అధికారం చెలాయిస్తూ.....

పో! పోయి కష్టపడు. పో.... పోయి పుట్టలు కట్టండి. గింజలు పోగుచేయండి. తీరిగ్గా నేనో, మావాడో, మరొకడో వస్తాం. పో! పో! పోయి పనిచేసుకో.....!

హుంకారంగా నవ్వుకుంటూ పాము మళ్లీ పడుకుంటుంది. ఆవలించి క్రమంగా గుర్రుపెట్టి నిద్రపోతుంది.

ఆలోచనల చీమ విశ్వరూపమై పోతుంది. నెమ్మదిగా లేదుకుని..... గుంపు బాగుకుంటుంది.....

ఆలోచనల చీమ :– అమ్మ నాకొడకా....! ఎంత గొప్ప సత్యం చెప్పావురా! నాలుగు వేదాలూ చదువుకున్నా ఈసత్యం నాకర్థం కాలేదు. నిజంగా నాకళ్లు తెరిపించావురా నాయనా!

కళ్ళు తెరిపించిన శత్రువుకే గుండం పెడుతుంది. ఇక వీడో కొత్త ఉద్వేగం వచ్చినవాడిలా, రెండడుగులు ముందుకు వేసి పడుకున్న పామును చూస్తూ.....

కోపంగా, హుంకారంగా.

ఆలోచనల చీమ :– నేను కష్టపడేవాడ్నా? నువ్వు సుఖపడే వాడివా? అలా అని దేవుడు చెప్పాడా....?

ఆలోచనా చీమ కొత్త ధైర్యాన్ని తెచ్చుకుని చూసి, దూరంగా నక్కివున్న చీమలన్నీ మూడు కాళ్ళంత గుంపుగా వచ్చాయి.

మునలి చీమ నెం. 1 :– అవున్రా నాయనా! ఇది లోకంలో ఉన్నదేరా? మనమేమో కష్టపడి పుట్టలు కడతాం. ఏ-ములొచ్చేమో అందులో చేరతాయి. మనం కష్టపడే వాళ్లం. వాళ్ళు సుఖపడేవాళ్ళు. లోకం తీరే అంత. ఇందులో కొత్తేముందిరా? ఇది పాతకథే.

తీవ్రంగా.... కోపంతో....

ఆలోచనల చీమ :-- కాదు.... ఆ కథ మార్చాలి.

మైమ్‌లో ఉత్తేజకరమైన ఎలుగు సంగీతం వినిపిస్తుండగా, ఆలోచనల చీమ అక్క డికక్కడే తన వాళ్లందర్నీ ఉత్తేజపరుస్తూ ఉపన్యాసం ఇస్తుంది. అందరూ సైలంటే సైలనుకుంటారు. కర్రలెత్తుతారు.

నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ ఆలోచనల చీమ వెనుకే నడిచి చీమలన్నీ కలిసి మధ్యలో వదులుకున్న పాముచుట్టూ గుండ్రంగా నిలబడతాయి. తీవ్రంగా క్షీణ పీల్చి వదులుతూ చీమలన్నీ ఒక్కసారిగా కర్రలెత్తి పామని కొడతాయి. పాము గిలగిలా కొట్టుకుంటూ రంగం అంతా దొర్లుతుంది. విడవకుండా చీమలు కర్రలతో మోదుతాయి. పాము గిలగిలా తన్నుకుని ప్రాణాలు విడుస్తుంది.

'హేయ్!' అని ఎగిరి చీమలన్నీ పాము మృతదేహం చుట్టూ మళ్ళీ వరుసగా చేరి విజయోత్సాహంతో నృత్యం చేస్తాయి.

పాట నెం. 9

చిట్ చిట్ చిట్ చిట్ చీమలం

చిట్టి చీమలం చలి చీమలం

చూడాలంటే కనపడమూ

చప్పుడు కూడా చేయము..... ॥ చిట్ చిట్ ॥

కానీ, కలిసామంటే ఇక్కపై మేము

చరిత్రకూడా మారుస్తాం.....

చీమల చరిత్ర కూడా మారుస్తాం.....

పాముల చరిత్ర కూడా మారుస్తాం..... ॥ చిట్ చిట్ ॥

పాట నెం. 9

చిట్ చిట్ చిట్ చిట్ చీమలం

చిట్టి చీమలం చలి చీమలం

చూడాలంటే కనపడమూ

చప్పుడు కూడా చేయము..... ॥ చిట్ చిట్ ॥

కానీ, కలిసామంటే ఇక్కపై మేము

చరిత్రకూడా మారుస్తాం.....

చీమల చరిత్ర కూడా మారుస్తాం.....

పాముల చరిత్ర కూడా మారుస్తాం..... ॥ చిట్ చిట్ ॥

బ-లసాహి-తి

తెలుగులో పిల్లలకు మంచి పుస్తకాలను తీసుకురావాలన్న ఉద్దేశంతో 'బాలసాహితి'ని స్థాపించాం. వినోదం, విజ్ఞానం మేళవించి ఆటల పాటలమధ్య హాయిగా చదువుకోడానికి వీలైన పుస్తకాలు అందించదలిచాం. మూఢనమ్మకాలకు దారితీయని చక్కని కథలు, గాథలు ప్రచురించదలిచాం. వీటితోపాటు పిల్లలతో ఎలా ప్రవర్తించాలో, వారికి ఎలా బోధించాలో తల్లిదండ్రులకూ, ఉపాధ్యాయులకూ ఉపయోగపడే పుస్తకాలు తీసుకురాదలిచాం. ఈ ప్రయత్నంలో మీ సహాయ సహకారాలు కోరుతున్నాం. పై ఆశయాలకు అనుగుణంగా ఉన్న పుస్తకాలూ, అనువాదం చేయదగ్గవీ ఉంటే మాకు తెలియ చేయండి. బాలసాహితి ప్రచురించిన పుస్తకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్ళడానికి సహాయపడండి. మీ ప్రాంతపు గ్రంథాలయాల్లో, పాఠశాలల్లో ఈ పుస్తకాలు ఉండేట్టు చూడండి. పాఠకుల సౌకర్యార్థం బుక్‌క్లబ్ పథకం ఉంది. ఇందుకు వంద రూపాయలు కట్టి 25 శాతం రాయితీతో రూ.132 విలువగల పుస్తకాలు పొందండి. యం.ఓ.లకు, ఇతర వివరాలకు :

బాలసాహితి
2-1-1/5, నల్లకుంట
హైదరాబాదు - 500 044.

విడుదల కానున్న పుస్తకాలు

1. టాన్‌గ్రామ్

ఏడు ముక్కలు ఎన్నో బొమ్మలు

– అరవింద గుప్తా

చైనాదేశపు పురాతనమైన ఈ ఆటను చిన్న పిల్లలు ఆడుకోటానికి, రంగులు పూయటానికి అనువుగా రూపొందించిన పుస్తకం.

2. కాలెండర్‌తో అంకెల సరదా

– పి.కె. శ్రీనివాసన్

మనం రోజూచూసే కాలెండర్‌ను ఉపయోగించి 11–14 సంవత్సరాల పిల్లలకు లెక్కల్లో ఆసక్తి కలిగించే పుస్తకం.

3. ఫతిక్ చంద్

– సత్యజిత్‌రే

ప్రసిద్ధ బెంగాలీ సినీ దర్శకుడు పిల్లలకోసం రాసిన నవలిక. దీనిని బెంగాలీలో సినిమాగా కూడా రూపొందించారు. నవల, సినిమా రెండూ విశేష ఆదరణ పొందాయి.

ప్రచురణ సంఖ్య : 1
ప్రతులు : 1,000

వెల 8 రూ.
ఫోటోలు కె. బాల్‌రెడ్డి, అలిశెట్టిప్రభాకర్
రూపకల్పన షరీఫ్
మొదటి ముద్రణ జనవరి, 1990
వివరాలకు బాలసాహితి
2-1-1/5, నల్లకుంట, హైదరాబాద్ - 500 044
ముద్రణ ప్లానోగ్రాఫర్స్, అక్షరాలు ఓంసాయిలేజర్ గ్రాఫిక్స్

బాలసాహితి

'పిపీలికం' కథ ఒకనగొలికనైన అన్వేషణతో ప్రారంభనై, ఒకప్రాగనికనైన ఆచరణలో ముగుస్తుంది. ఒక చిన్న చీమకు 'నేనెవరు?' అనే పెద్ద ప్రశ్నతడుతుంది. ఆ ప్రశ్నకు సమాధానంకోసం గురువుల వద్ద విద్యార్జన, జ్ఞానార్జన... కష్టపడి సాధించింది. కాని ప్రశ్న ప్రశ్నలాగే మిగిలింది. అంతపెద్ద ప్రశ్నకూ... చిన్నసమాధానం ఒక దుర్మార్గమైన పాము చెప్పింది. "నీవు చీమవు. నేను పామును. నీవు కష్టించాలి. నేను సుఖపడాతి". ఈ జ్ఞానం చాలు.. చీమ కార్యాచరణకు పూనుగొనడానికి. అదీ కథ

కీలెరిగి

కథ

రాచకొండ విశ్వనాథశాస్త్రి

నాటకీకరణ

పసుపులేటి పూర్ణచంద్రరావు